తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తమిళనాడు గవర్నర్‌చే ఆచార్య జయలలితకు అవార్డు



కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ కన్నడ అనువాద, అధ్యయన శాఖలో పనిచేస్తున్న ఆచార్య జయలలిత తమిళనాడు గవర్నర్ రవి చేతుల మీదుగా తిరుమురై తిరుమగళ్ అవార్డును అందుకున్నారు. తమిళ ప్రాచీన కవి మాణిక్యవాచగర్ రచన తిరువాచకంను కన్నడలో ఆచార్య జయలలిత అనువదించారు. ఈ నేపథ్యంలో చెన్నై రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆచార్య జయలలిత అవార్డు అందుకున్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ, రెక్టార్ ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డిలు ఆచార్య జయలలితను అభినందించారు.

## ఓ నిండు ప్రాణం నిలిపేందుకు సిఎం చొరవ

### న గుంటూరు నుంచి తిరుపతికి చేరిన గుండె

### పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కొనసాగుతున్న హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స



హెలికాప్టర్‌లో రేణిగుంటకు చేరుకున్న కృష్ణ గుండె

రేణిగుంట, తిరుపతి టౌన్ సెప్టెంబరు 26 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిండు ప్రాణాన్ని కాపాడడం కోసం ఆపరేషన్ గ్రీన్ ఛానల్ ద్వారా హెలికాప్టర్‌లో బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి గుండె గుంటూరు నుంచి మంగళవారం తిరుపతికి చేరింది. వివరాలు ఇలా... గుంటూరులో కట్టాకృష్ణ(18) ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయింది. అతని అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. తిరుపతి పద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 33 ఏళ్ళ పేద యువకుడు ప్రాణాపాయ స్థితిలో గుండె మార్పిడి కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలియడంతో తక్షణం ఆయన సమయం వృధా కాకుండా హెలికాప్టర్ ద్వారా గుండెను రేణిగుంట విమానాశ్రయానికి పంపే ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.గుండె యుద్ధ ప్రాతిపదికన హెలికాప్టర్‌లో రేణిగుంట చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా గుండెను పద్మావతిసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చేర్చారు. తాను చనిపోయినా తన అవయవాలను మరి కొంత మందికి దానం చేసి కట్టాకృష్ణ మృత్యుంజయుడయ్యాడు.

# వైభవోపేతంగా చక్రదారుడి చక్రస్నానం



## వేడుకగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

### శ్రీ వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో రూ. 28.73 కోట్లు హుండీ ఆదాయం

తిరుమల, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త ప్రతినిధి :

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీ వారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుండి 6 గంటల వరకు స్వామి వారికి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీ దేవి, భూ దేవి సమేత శ్రీమలయప్పస్వామి వారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖునిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రములు, దశశాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రములు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను తిరుమల పెద్దజీయర్ స్వామి, తిరుమల చిన్నజీయర్ స్వామి వారి శిష్యబృందం పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. శ్రీ వారి ఆలయ ప్రధాన అర్చకులు అర్చకం రామకృష్ణ దీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొమ్మిది రోజుల ఉత్సవాలలో జరిగిన అన్ని సేవలూ సఫలమై – లోకం క్షేమంగా ఉండడానికి, భక్తులు సుఖ శాంతుల్తో ఉండడానికి – చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవాలు ఒక యజ్ఞమే కనుక యజ్ఞాంతంలో అవభృథస్నానం చేస్తారు. యజ్ఞనిర్వహణంలో జరిగిన చిన్న చిన్న లోపాల వల్ల ఏర్పడే దుష్పరిణామాలు తొలగి, అన్నీ సంపూర్ణ ఫలాలు చేకూరడం కోసం చేసే దీక్షాంత స్నానం అవభృథం, ఈ ఉత్సవాలు చేసిన వారికి, చేయించినవారికి, ఇందుకు సహకరించి వారికీ, దర్శించిన వారికీ అందరికీ ఈ ఉత్సవయజ్ఞఫలం లభిస్తుంది. వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారికి 28.73 కోట్లు హుండి ఆదాయం వచ్చిన్నట్లు తెలిపారు. గత బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారికి లభించిన 22.38 కోట్లు కంటే ప్రస్తుతం 6.35కోట్లు అదనంగా హుండిఆదాయం భక్తులు సమర్పించారు.

**- ధ్వజావరోహణం..**

చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజావరోహణం యథావిధిగా చేవారు. ఇంతటితో బ్రహ్మోత్సవయజ్ఞం మంగళాంతం అయ్యింది. ఎవరైతే బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకొంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారు. విషమృత్యు నాశనం, రాజ్యపదవుల వంటి సకల ఐహిక శ్రేయస్సులు పొందుతారు. పరాంతకాలం వరకూ ఎటువంటి జనన, మరణ వికారములు లేకుండా సర్వలోకాలంలో యథేచ్ఛగా విహరిస్తూ బ్రహ్మానందాన్ని పొంది శాశ్వతమైన విష్ణులోకాన్ని చేరుకున్నారు. అనంతరం రాత్రి 7 నుండి 9 గంటల మధ్య బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది. రాత్రి 8 నుండి 10 గంటల మధ్య ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఎవి. ధర్మారెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జెఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, సివిఎస్వో నరసింహ కిషోర్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర అధికార ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభాల తొలగింపుతో

## అంధకారంలో 3 గ్రామాలు



క్వారీ యజమానులతో మాట్లాడుతున్న ఇఒ పిఆర్‌డి, రోడ్డు వేసే క్రమంలో ధ్వంసమైన విద్యుత్ స్తంభం

విజయపురం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :

మండలంలోని మహారాజపురం గ్రావెల్ క్వారీకి రోడ్డు క్లియర్ చేయడానికి మంగళవారం క్వారీ యజమానులు ఇష్టానుసరం వ్యవహరించడంతో శ్రీహరిపురం గ్రామానికి తాగు నీరు సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసమైంది. అలాగే మూడు విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరగడంతో శ్రీహరి పురం, మల్లారెడ్డికండ్రిగ, నారపరాజుకండ్రిగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రావెల్ క్వారీ తరలించేందుకు అడ్డుగా వున్నాయని సంబంధిత యజమానులు ఒక బోరు, మూడు విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేశారు. సమాచారం తెలుసుకున్న ఇఒ పిఆర్‌డి బాబు, గ్రామస్తులు సంఘటనా స్థలం చేరుకుని క్వారీ యజమానులతో వాగ్వివాదానికి దిగారు. పైప్‌లైన్ సిద్ధం చేస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనపుడు నెల రోజులైనా పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని సమాచారం అందడంతో ట్రాన్స్‌కో సిబ్బంది హుటాహుటిన విద్యుత్ స్తంభాలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

### పవిత్రోత్సవాలకు

## యాగశాల ఏర్పాటు

### ఆలయంలో భక్తి భావం



యాగశాలకు పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలను ఏర్పాటు చేసారు. ఆలయ ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారధ్యంలో యాగశాలను ఏర్పాటు చేసారు. ఆలయంలో నిర్వహిస్తున్న సేవలు,అభిషేకాల్లో తెలిసి తెలియక జరిగే అపచారాల నివృత్తికి ప్రయాశ్చిత్తంగా పవిత్రోత్సవాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో మంగళవారం యాగశాల ఏర్పాటు చేసారు. ఇక్కడ పూజలకు ఆలయంలోని ఈశాన్య మూల ఏర్పాటు చేయబడిన యాగశాలలో హోమాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఇక్కడ హోమాలతోపాటు కలశస్థానన జరిపారు. ప్రతి రోజూ ఇక్కడ హోమాలు నిర్వహిస్తారు.చివరి రోజు ఇక్కడ పూర్ణాహుతి జరిపి ఆలయాధికారులు,ధర్మకర్తల మండలి సిబ్బందికి పవిత్రాలు అందిస్తారు. పూజా కార్యక్రమాల్ని ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ సూచనలతో పౌరోహితులు అర్ధగిరి స్వామి పర్యవేక్షించారు. బుధవారం నాటి కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్,ఆలయ డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య ఎసి మల్లికార్జున్ ప్రసాద్,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు ఉన్నారు.అలంకార మండపం నుంచి పవిత్రాలను అంజూరు తారక శ్రీనివాసులు, సూరిగురుకుల్ డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, సుదర్శనం రెడ్డి,కామేశ్వరరావులు వెంట రాగా యాగశాల వద్దకు చేర్చారు.అక్కడ ప్రత్యేకంగా కలశాలను ఏర్పాటు చేసారు. పూజలు, హోమాలు నిర్వహించారు.

## ప్రధానోపాధ్యాయులపై మరో కొత్త భారం

కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

ఇప్పటికే బోధనేతర పనులకు సతమతం అవుతున్న ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం మరో బాధ్యత అప్పగించింది. ఆ ప్రకారం బడి మానేసిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలి. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియా (జిఇఆర్) కొనసాగాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండాలని, ఎవరూ మధ్యలో చదువు మానేయకూడదు అన్నదే లక్ష్యం. కుటుంబ పరిస్థితులతో పాటు వివిధ కారణాలతో విద్యార్థులు డ్రాపవుట్ అవుతున్నారు. ప్రతి రోజు విద్యాశాఖ కార్యాలయం నుంచి ఎంత మందిని చేర్చాలన్న సమాచారం కోరుతున్నారని, దీనివల్ల ఒత్తిడికి గురవుతున్నామని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్ ఆ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వివాహం కావడం, శాశ్వతంగా వలసపోవడం, వయస్సు మీరిపోవడం, ఆచూకీ లేకపోవడం, మరణించడం వంటి ఐదు కారణాలను సర్వేలో పొందుపరచగా, ఎక్కువగా ఆచూకీ లేరని, వలసపోయారని సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సర్వే సక్రమంగా జరగలేదని, మళ్లీ సర్వే చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశించినట్లు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్.....ప్రభుత్వం లక్ష్యం

### జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించండి

### సి.మల్లవరంలో ఆరోగ్య సురక్ష ప్రయోగాత్మక వైద్య శిభిరాన్ని సందర్శించిన కలెక్టర్

### -జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలను విజయవంతం చేయండి : -తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్26 ప్రభాతవార్త:

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రయోగాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలలో ఏమైన లోటు పాట్లు ఉంటే సవరించుకుని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలు ఈనెల 30 నుండి సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి, విజయవంతం చేయాలన్నారు. మంగళవారం తిరుపతిరూరల్ మండలం సి.మల్లవరం గ్రామ సచివాలయంలో ప్రయోగాత్మంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిభిరాన్ని తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ డిఇఓ, పిడి మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించగా, కలెక్టర్ అతిధిగా పాల్గొని, దిశ నిర్ధేశం చేసారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామ,వార్డు సచివాలయం పరిధిలో ఈనెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గృహ సందర్శనతో అవగాహన కల్పించే క్యాంపెయిన్ ప్రారంభించబడందని, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయిలో గృహ సందర్శన చేసి, ప్రజలకు అవగాహన కల్పించడం,ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసి, దాని వినియోగం తెలియజేస్తూ వారి ఇంటివద్దనే ఏడు రకాల పరీక్షలు చేసి, ఆరోగ్య వివరాల రిపోర్టును మొబైల్ యాప్ నందు నమోదు చేసి ప్రొఫైల్ జనరేట్ చేసి, కేషీట్ జనరేట్ చేసి పరీక్షల రిపోర్టులు వైద్య శిభిరాలు నిర్వహించే నాటికి డాక్టర్లకు అందుబాటులో ఉండేలా సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కేంద్రాలను ఈనెల 30 నుండి ప్రారంభం కానున్నాయని, వైద్య శిభిరాలకు 3రోజుల ముందు మళ్లీ ఒకసారి వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు కలిసి, గృహ సందర్శనలో ప్రజలకు వైద్య శిభిరం వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు. తిరుపతి జిల్లాలో సి.మల్లవరంలో వైద్య శిభిరాన్ని ట్రయల్ రన్‌గా చేపట్టడం జరిగిందన్నారు.. దాదాపు 500 మంది వైద్య శిభిరాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి, ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ రమాదేవి, డిఎంహెచ్ఓ శ్రీహరి, శిశు సంక్షేమ అధికారి జయలక్ష్మీ, డిఇఓ శేఖర్, డిపిఎంఓ శ్రీనివాసులు, ఆరోగ్యసమన్వయ కర్త రాజశేఖర్‌రెడ్డి, డిఐఓ శాంతకుమారి, డిఎల్‌డిఓ సుశీలాదేవి, ఎంపిడ్పి, ఇవోపిఆర్డీ, వైకాపా నేత మొక్కల తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నడకదారి భక్తులకు ఊరట

### ఫలిస్తున్న టిటిడి ఇఓ ధర్మారెడ్డి ప్రయత్నాలు

### ఆపరేషన్ చిరుతను నిరంతరాయంగా కొనసాగిస్తున్న టిటిడి

తిరుమల, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త

గత వారం రోజులుగా నడకదారిలో చిరుతల సంచారం కనిపించకపోవడంతో నడకదారి భక్తులకు కొంత ఉరట లభించింది. టిటిడి ఇఓ ధర్మారెడ్డి ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఆపరేషన్ చిరు తలో భాగంగా ఆరు చిరుతలను బంధించారని, చిరుతల కదలికలను గుర్తించేందుకు నడకదారిలో 300 ట్రాప్ కెమరాలు ఏర్పాటు చేసారు. 19వ తేది నుంచి చిరుత, ఎలుగుబంట్ల సమాచారం కనిపించడం లేదు. నడకదారికి సమీపంలో సంచరిస్తున్న చిరుతలను అన్నింటిని ట్రాప్ చేసినట్లు అటవిశాఖ అధికార్లు భావిస్తున్నారు. టిటిడి రెండు నడకదారిలో ఇనుపకంచే ఏర్పాటుకి వైల్డ్ లైఫ్ అనుమతులు కోరారు. డెహ్రాడూన్‌కి చెందిన వైల్డ్ లైఫ్ సైంటిస్ట్ రమేష్ నేతృత్వంలో కేంద్ర వైల్డ్ లైఫ్‌ను కమిటీ ఏర్పాటు చేసారు. రేపటి నుంచి రెండు నడకదారిలో పరిశీలన జరపనున్న సైంటిస్ట్ రమేష్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు నడకదారిలో ఇనుప కంచె ఏర్పాటుకు వున్న సాధ్యాసాధ్యాల పై కమిటి నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## అశ్వవాహనంపై అలరించిన శివపుత్రుడు



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాథుడు అశ్వవాహనంపై అధిరోహించి కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అలరించారు. రాత్రి ఆలయంలో వైభవంగా తిరుకళ్యాణం జరిగిన అనంతరం స్వామివారికి అశ్వవాహనసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజవంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులచే ఉదయం స్వామివారికి అష్టోత్తర శతకలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్లు సర్వాలంకృతులై అలంకార మండపంలో వేదపండితుల మత్రోచ్ఛారణ నడుమ అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పుష్పాలతో దేధీప్యమానంగా అలంకరించిన అశ్వవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సా ంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు.

## కమనీయం వరసిద్ధుని కళ్యాణం

### -పులకించిన భక్తజనం



స్వామివారి కళ్యాణం సందర్భంగా మాంగల్యం చూపుతున్న అర్చకులు, తిలకించిన అశేష భక్తజనం

కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామివారి తిరుకళ్యాణం నిర్వహించడానికి తల్లిదండ్రులైన శివపార్వతులు పగలు కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేశారు. ఈసందర్భంగా అలంకృతులైన శివపార్వతులు మణికంఠేశ్వరాలయంలో అర్చకసా ్వముల పూజలందుకున్న అనంతరం కాణిపాకం, కాకర్లవారిపల్లె గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ తమ పుత్రుడు వరసిద్ధుని తిరుకళ్యాణానికి భిక్షాటన చేశారు. అనంతరం రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేధీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాధులకు పుణ్యాహావాచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు. అనంతరం అశేష భక్తజనం నడుమ స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యధారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈతిరుకళ్యాణాన్ని తిలకించిన అశేష భక్తజనం భక్తి పారవశ్యంతో పరవశించిపోయారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

**గణనాథునికి ఘనంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం -ఆలయంలో కిక్కిరిసిన భక్తుల రద్దీ**

4లో

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళా కార్మికులకు కరపత్రాలు పంచిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల

కుప్పంరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారని స్థానిక షాహీ గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేసే మహిళా కార్మికులకు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ కరపత్రాలు పంచారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు ఎప్పుడూ ఆకాంక్షిస్తారని అలాంటి వ్యక్తిని వైకాపా ప్రభుత్వం అన్యాయంగా అరెస్ట్ చేసిందన్నారు. మహిళలు చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

వి.కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ అధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పేర్కొన్నారు. మంగళవారం వి.కోటలో అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోడీ, దీనదయాళ్ జయంతి ఉత్సవాలు

పాలసముద్రం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం పాలసముద్రం హరిజనవాడలో ప్రధాని నరేంద్రమోడి, పండిత దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాలను మంగళవారం బిజెపి ఎస్సీ మోర్చా, మండల బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దీనదయాళ్ చిత్రపటానికి బిజెపి మండల అధ్యక్షుడు రాజేష్, జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మురుగదాస్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ భారతదేశంను ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా తీసుకెళ్ళడానికి ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కుప్పం జ్యోతి, చిన్నస్వామి, బొమ్మరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన, టిడిపిల ప్రభుత్వం ఏర్పాటు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



రాష్ట్రంలో జనసేన, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కానుందని చిత్తూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దయారాం పేర్కొన్నారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం తెలుగు విద్యార్థి ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మాలు చేపట్టారు. జనసేన ఇన్‌ఛార్జ్ దయారాం నిరసన కేంద్రం వద్దకు సంకెళ్ళు వేసుకొని వచ్చిన తెలుగు విద్యార్థి నాయకులకు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపా ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా దేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, కిషోర్, రాజశేఖర్, సురేంద్రకుమార్, జనసేన వీరమహిళ కల్పన దయారాం తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్ల నిరసన




చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎఐటి యుసి, సిఐటియుల ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి జిల్లా ఎఐటియుసి అధ్యక్షుడు నాగరాజు మాట్లా డుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 25న ఛలో విజయవాడ కార్యక్రమంకు పిలుపిస్తే పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధించారని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని, మినీ అంగన్‌వాడీలను రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రభావతి, సుజినిలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ సిఎం వైఎస్ జగన్ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. సిఐటియు నాయకులు దాసరి చంద్ర, సురేంద్రన్, రమాదేవి, బిందు, సునీత, గౌరి, రెడ్డమ్మ, రఘు, బాలాజీ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపాలిటీ గేటు చెల్లింపులకు ఎంపి మిథున్‌రెడ్డి నిర్ణయం : ఎం.పి. రెడ్డెప్ప

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలో చిరువ్యాపారులు, రైతులకు మేలు కలిగించేందుకు రాజంపేట ఎం.పి. మిథున్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరువ్యాపారులు, రైతులు మున్సిపాలిటీకి రోజువారీ గేటు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి వీరి నుంచి వచ్చే గేటు రుసుం నగదును ఎంపి మిథున్‌రెడ్డినే స్వయంగా తన సొంత నిధులతో కుప్పం మున్సిపాలిటీకి చెల్లిస్తారన్నారు. ఇందుకుగాను గేటు చెల్లించేవారికి ఐడి కార్డులు అందిస్తామని చిరువ్యాపారులు,రైతులు ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపి లాడ్స్ నిధులతో కుప్పం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంప్లెక్స్ నిర్మాణంకు 50లక్షలు, 3వ సచివాలయం నిర్మాణం కోసం 25లక్షలు, మార్కెట్ యార్డు ప్రహరీగోడ నిర్మాణంకు 15లక్షలు వంతున కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే వాల్మీకి, కురబ కమ్యూనిటీ హాళ్ళు, అంబేద్కర్ భవనాలకు సుమారు రెండు కోట్ల మేర తాను ఎంపి లాడ్స్ నిధులు కేటాయించానన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్లు గణపతి, మోహన్‌రాం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు జరిగిన అన్యాయం ప్రజల్లోకి

కుప్పంరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలోని ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్, బైపాస్ రోడ్‌లోని పూల మార్కెట్‌లో దేశం నేతలు రైతులకు కరపత్రాలు పంచారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తే నేడు వారు వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. అయితే ఇందులో స్కాం జరిగిందని వైకాపా ప్రభుత్వం ఆదేశాలతో చంద్రబాబును సిఐడి అక్రమ ంగా అరెస్ట్ చేసిందన్నారు. చంద్రబాబు వెంట రాష్ట్ర ప్రజలు ఉన్నారనే విషయం మరచిపోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు కన్నన్, ఆర్ముగం, రవి, కాణిపాకం వెంకటేష్, నాగేంద్ర,వేణు, కౌన్సిలర్ జిమ్‌దాము, నరేష్, ప్రకాష్, తిరుమగళ్, యశోదమ్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 66కోట్ల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



కుప్పంలో అభివృద్ధి చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు ప్రజల చెవుల్లో రక్తాలు కారేలా పేర్కొన్నారని నేడు అధికార వైకాపా కౌన్సిలర్లే అభివృద్ధి చేయలేదని పేర్కొనడం చూస్తే ఏమేర అభివృద్ధి జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలిసిందని ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంకు 66కోట్ల నిధులు కేటాయించామని సిఎం జగన్ ప్రకటించారని ఈ నిధులతో ఏం పనులు చేశారో మున్సిపల్ ఛైర్మన్, కమీషనర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుప్పం మున్సిపల్ కార్యాలయంకు వైకాపా కౌన్సిలర్లు తాళాలు వేసి రాష్ట్రం మొత్తం మాట్లాడుకునేలా చేశారన్నారు. దీనికి మంత్రి సమాధానం చెప్పాలన్నారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే సొంత పార్టీ కౌన్సిలర్లనే సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. ఎంపి రెడ్డెప్ప భవనాలకు కాకుండా కుప్పంలో డ్రైనేజీలు, రోడ్ల ఏరా ్పటుకు నిధులు కేటాయిస్తే బాగుంటుందన్నారు. ఎమ్మెల్సీ ఇంటి ముందరే నీళ్లు నిల్వ ఉంటున్నాయన్నారు. సమావేశంలో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, నేతలు కన్నన్, బాబునాయుడు, వల్లెప్ప, సంతోష్, వేణు, మురళి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలు ఉపయోగించుకోవాలి

### : జిల్లా సహిత విద్యా సమన్వకర్త ప్రభాకర్ వర్మ

వెదురుకుప్పం,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :



దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్యా సమన్వకర్త ప్రభాకర్ వర్మ మంగళవారం తెలిపారు. మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక పాఠశాలగల భవిత సెంటర్ నందు మండల విద్యాశాఖాధికారులు మహేశ్వరరావు, దామోదరంల అధ్యక్షతన వైద్య నిర్ధారణ పరీక్షల అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం కొరకు ప్రతి ఏటా వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు అందరితో పాటు విద్యా అభ్యాసించి అభివృద్ధి చెందాలని ప్రభుత్వం వారికి ఉచితంగా పరికరాలు అందజేస్తున్నదని చెప్పారు. అనంతరం డాక్టర్‌లు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాల మంజూరుకు సిఫార్సు చేశారు. క్యాంపుకు వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరైన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ శిల్పా, సహిత ఉపాధ్యాయులు శ్యామల, శేఖర్,సింధుజ, ప్రధానోపాధ్యాయురాలు లీలావతి,ఫిజియోతెరఫిస్టు నిరంజన్ రెడ్డి,దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ప్రతిభ

కుప్పంరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిఆపారు. బికాం (సిఎ)లో పూజ 9.45పాయింట్లు, సాయి లిఖిత 9.20, బిఎస్సీ(ఎంపిసిఎస్)లో కావ్య 9.63, ప్రభా కర్ 8.95, ఎంఎస్‌సిఎస్‌లో హసీనా 8.82, రూప8.73, బిజెడ్‌సిలో దీప 8.80, యశ్వంతి 8.60, బిబిఎలో లావణ్య 8.0, జీవ 7.93పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అమెరికా యూనివర్శిటీతో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి అవగాహన ఒప్పందం



కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయం యూనివర్శిటీ ఆఫ్ మసాచుసట్స్, డార్ట్ మౌత్‌తో విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవగాహన చేసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా ఎన్‌బికెఆర్‌లో ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఐదేళ్లలో బిటెక్ డిగ్రీతో పాటు అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ మేరకు అమెరికా వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.టెస్‌ఫే మెర్సీతో విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు వర్చువల్‌లో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఎన్‌బికెఆర్ కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి కల్పించినందుకు ఆయనకు యూనివర్శిటీ ఆఫ్ మసాచునట్స్ అసోసియేటెడ్ డాక్టర్ టెస్‌ఫే మెర్సి మాట్లాడుతూ ఎన్‌బికెఆర్‌లో చదివే విద్యార్థులకు ప్రపంచంలో అత్యున్నత విద్యాసంస్థలో చదువుకోవడానికి ఇదొక మంచి అవకాశమని పేర్కొన్నారు. ఐదేళ్ల బిటెక్, ఎంఎస్ డిగ్రీలకు అమెరికాలో గుర్తింపు ఉందని చెప్పారు. యూనివర్శిటీ డీన్ విండర్ గైనస్ట్ మాట్లాడుతూ ఎన్‌బికెఆర్ విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ ఆర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ ఎంఒయు కుదుర్చుకోవడానికి ఎంతో సహకరించిన మసాచునట్స్ యూనివర్శిటీలో పనిచేస్తున్న తెలుగు ప్రొఫెసర్ విజయ చలివేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన



కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

కోట మండలం కేశవరం గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, తల్లులకు పౌష్టికా హారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఓ మునికుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, నిరక్షరాస్యత కారణంగా సరైన అవగాహన లేక అనేక రుగ్మతలకు గురవుతుంటారని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా సెప్టెంబర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం కలగకుండా ఉండాలంటే మంచి విటమిన్లు కలిగిన ఆహారం, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ్ జూనియర్ కాలేజి విద్యార్థికి గోల్డ్‌మెడల్

నాయుడుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని విక్రమ్ జూనియర్ కాలేజిలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎల్లసిరి రిషి అనే విద్యార్థి సెప్టెంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన 67వ ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కాలేజి యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థి రిషిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. కోచ్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా శిక్షణ పొందుతున్న విద్యార్థి రిషి విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ఇదే కాలేజిలోని మహిళల రెజ్లింగ్ పోటీల్లో పసల జస్మిత్ అనే విద్యార్థి పాల్గొంటుందని తెలిపారు. అనంతరం కాలేజి డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థి గోల్‌మెడల్ సాధించడం కాలేజికి గర్వకారణంగా ఉందని, అంతేకాకుండా విక్రమ్ జూనియర్ కాలేజి విద్యతో పాటు క్రీడారంగంలోనూ కూడా ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌బాబురెడ్డి, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.నరేంద్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## చంద్రబాబును మానసిక క్షోభకు గురిచేస్తున్నారు

### - మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

దేశంలోనే మచ్చలేని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఒక్క చంద్రబాబునాయుడే అని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. చంద్రబాబు నాయు డును అరెస్టు చేసి మానసిక క్షోభకు గురిచేశారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌కు నిరసనగా బాబుకి తోడుగా ఒన నియంతపై పోరాటం కోసం మేము సైతం అని మంగళవారం టీడీపీ కార్యాలయంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 14వ రోజులో భాగంగా గూడూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి మాజీఎమ్మెల్యేపాశం సునీల్‌కుమార్ దీక్షలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఏ అవినీతి చేయలేదు కాబట్టే బెయిల్ వద్దు క్వాష్ పిటిషన్ కోరుతున్నారని తెలిపారు. నారా లోకేష్‌ని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు అని ఏ14గా చేర్చడం నిజంగా హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పట్టాభిరెడ్డి, దినేష్, పట్టణ ఉపాధ్యక్షులు నరసింహానాయుడు, జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కారనయదర్శి నిమ్మకాయల నరసింహులు, మాజీ కౌన్సిలర్లు గాయం రమణయ్య, ఇస్రాయిల్ కుమార్, శివకుమార్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంట్ మహిళా కార్యదర్శి గుండాల భారతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తాళ్ల సుబ్బమ్మ, సరస్వతమ్మ, పర్వీన్, సుధా, సుబ్బరత్నమ్మ, నాయకులు పరమేశ్వరగౌడ్, కస్తూరి గురవయ్య, వల్లూరు మోహన్, సురేంద్ర, శివప్రసాద్ గౌడ్, యువత వేముల సునీల్, సందీప్, టిఎన్‌ఎస్‌ఎఫ్ సభ్యులు వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తడలో దాడి.. పలువురికి గాయాలు

తడ, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

తడ మండలం పూడికుప్పానికి చెందిన వారిపై తడకుప్పానికి చెందిన 15 మంది మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు, పూడికుప్పానికి చెందిన సంబందం మురళి తడ కుప్పానికి చెందిన 15 మందిపై ఫిర్యాదు చేశాడు. ఎస్.ప్రభు, వినోద్, నరసింహాతో పాటు మరో 12 మంది ఈ దాడికి పాల్పడినట్లు చెప్పారు. మురళి, శేఖర్, ప్రభు, రంజిత్, దేశప్పన్, సెల్వకుప్పానికి చెందిన కుప్పరాజ్ అనేవారిపై ఈ దాడి జరిగింది. పులికాట్ జాలర్ల కుప్పాలకు సంబంధించిన సున్నితమైన సమస్య కావడంతో ఆయా కుప్పాల పెద్దల సమక్షంలో రాజీ చర్చలు జరిగి అనంతరం పోలీసు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ మేకు తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆచూకీ తెలిస్తే పోలీసులకు చెప్పండి

తడ, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

తడ పోలీసుస్టేషన్ పరిధిలోని అనపగుంట గ్రామంలో 2010లో జరిగిన ఒక కేసుకు సంబంధించిన నిందితుడు గత కొద్దిరోజులుగా కనిపించ లేదని పోలీసులు తెలిపారు. ఎం.రవి అనే నిందితుడు భార్యను చంపి జైలు శిక్ష అనుభవించి తిరిగి వచ్చాడు. అయితే అతను మళ్లీ కనిపించలేదని, ఆచూకీ తెలిస్తే తడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట కోర్టులో రవి మీద కేసు పెండింగ్‌లో ఉందని ఆయన చెప్పారు.

## మండలి నూతన కమిటీలో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి చోటు

వెంకటగిరి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి నుంచి ప్రభుత్వం ఏడు నూతన కమిటీలను ఏర్పాటు చేయగా రెండు కమిటీల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి చోటు దక్కింది. కమిటీ ఆన్ రూల్స్ మరియు కమిటీ ఆన్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్ అండ్ కల్చర్ ఈ రెండు కమిటీలలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సభ్యులుగా వ్యవహరించనున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం విడుదల చేసింది. శాసన మండలి కమిటీలలో సభ్యులుగా ఎంపికైనందున పలు విద్యా ఉపాధ్యాయ సంఘం నాయకులు, టీచర్లు చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## పోలీసుల తీరు అమానుషం

కోట,సెప్టెంబరు 26 ప్రభాతవార్త

విజయవాడలోని పలు చోట్ల ప్రభుత్వంకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై ఆందోళన చేస్తుంటే పోలీసులు తమపై లాఠీచార్జీ చేయడమే కాకుండా వాహనాల్లోకి ఈడ్చిపడేశారని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మంగళవారం కోటలో మాట్లాడుతూ ఈ సందర్భంగా పలువురికి గాయలలు అయ్యానన్నారు. కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్లుకు తరలించారని ఆరోపించారు.తమపై ఉక్కుపాదం మోపి అరెస్టులు చేయించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అంగన్ వాడీ కార్యకర్తలుగా పని చేస్తున్న వారికి రూ 13.650 ఇస్తుంటే ఏపీలో కేవలం రూ 11500 మాత్రమే ఇస్తూ తమ శ్రమ ను వైకాపా ప్రబుత్వం దోపిడి చేస్తోందని మండి పడ్డారు. సహాయకులకు తెలంగాణంలో రూ 9 వేలు ఇస్తుంటే ఇక్కడ రూ 7వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని విమర్శంచారు.తాము అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే రూ వెయ్యి అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చి నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు అదనపు పని భారం మానసిక ఒత్తిడి, రాజీకీయ వేధింపులు గతంలోనూ ఎన్నడూ లేని వధం పెరిగి పోయాయన్నారు.తమకు సంక్షేమ పథకాలు, గ్రాట్యుటీ డీఏలు, టిఏలు, అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎంపిని కలిసిన మత్స్యకారులు

వాకాడు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త



వాకాడు మంల పరిధిలోని దుగురాజ పట్నం గ్రామ పంచాయితీ సర్పంచ్ శ్రావణి భర్త, వైకాపా నాయకులు మహేంద్ర మంగళవారం తిరుపతిలో, తిరుపతి పార్ల మెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తిని స్థానిక మత్స్యకారులతో కలిశారు. ఆ పంచాయితీ పరిధిలోని పలు సమస్యలను ఎంపి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందిస్తూ ప్రజా ఉపయోగకరమైన సమస్యలను పరిష్కరిస్తామని ఎంపి హామీ ఇవ్వడంతో పాటు, పలు సమస్యలు పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని మహేంద్రతో పాటు మత్స్యకారులకి తెలిపారు.

## రూ. 3.61 కోట్లు ఆక్వా బకాయిలు

### ట్రాన్స్కో ఏడి వరప్రసాద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్కో ఏడి

వాకాడు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త

మండలంలోని ఆక్వా రైతులు మూడు కోట్ల 61 లక్షల రూపాయిలు బకాయిలు ఉందని, ఆక్వా రైతులు బకాయిలను వెంటనే చెల్లించాలని ట్రాన్స్కో ఏడి వరప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళశారం వాకాడు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దుగరాజపట్నం, తూపిలి పాలెం, కొండూరుపాలెం, తీర ప్రాంతాలలో ఆక్వా రైతులు వద్ద మూడు కోట్ల ఆరవై ఒక లక్ష, ఆక్వా కమర్షియల్ 22 లక్షలు, ఇళ్లపై కోటి 20 లక్షలు, ప్రభుత్వం తొమ్మిది కోట్లు బకాయిలు నిల్వ ఉన్నాయని వెంటనే ఆ బకాయిలను త్వరిత గతిన చెల్లించాలని రైతులను ఆయన కోరారు. మనలోని స్పెషల్ డ్రైవ్ కలెక్షన్‌లో రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని డ్యామేజ్ అయిన ట్రాన్సఫర్లు మార్చి కొత్త ట్రాన్సఫర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా పోల్స్ కూడా మార్చడం జరిగిందన్నారు. మనలని అన్ని పంచాయితీ గ్రామాలలో స్ట్రీట్ లైనులో పగలు కూడా ఎల్ఈడి బల్బులు వెలుగుతున్నాయని విద్యుత్తును ఆదా చేయవల్సి న బాధ్యత సెక్రటరీలు సర్పంచులు ఆ ఏరియాలో వీధి లైన్లో మెయిన్ స్విచ్ ఏర్పాటు చేసుకుని పగలుపూట ఎల్ఈడి బలుపును ఆర్పి వేయాలన్నారు. అదే విధంగా అగ్రికల్చర్ పోల్స్ కూడా మార్చడం జరిగిందన్నారు. ఆయన వెంట వాకాడు ఇన్చార్జి ఏఈ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొనడంతో యువకుడికి గాయాలు

వెంకటగిరి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: క్రాస్ రోడ్ వద్ద బైక్‌పై వెళుతున్న సూర్య అనే యువకుడిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన సూరి బైక్‌పై వెంకటగిరి వస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి**




బంగారుపాళ్యం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి పేర్కొన్నారు. మంగళవారం తిమ్మోజిపల్లి సచివాలయం నందు జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ మెడికల్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వ్యక్తికి వైద్య పరమైన పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా వైద్య సేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదన్నారు. ఇందుకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ప్రభుత్వం తీసుకువచ్చింద న్నారు. గ్రామంలో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఇతర వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేపడుతారన్నారు. ఈ వైద్య పరీక్షల్లో గుర్తించిన వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఇది పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వుంటుంద న్నారు. సంపూర్ణ ఆరోగ్య రాష్ట్రంగా దేశంలో మన రాష్ట్రం నిలబడుతుందని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జనార్ధన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా అందించే వైద్య సేవలతో పాటు గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహించి సేవలు అందిస్తామన్నారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సచివాలయం నందు ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంపులో చిన్న పిల్లలు, స్త్రీలు కన్ను, దంతము, చర్మ తదితర వైద్య బృందాలతో గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్, జిల్లా వైకాపా నాయకుడు ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్లప్ప, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం బంగారుపాళ్యం, తగ్గువారిపల్లి, జంబువారిపల్లి, తిమ్మోజిపల్లి గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తించిన పారిశుధ్య కార్మికులను జిల్లా అధికారుల బృందం సన్మానించింది.

## సూళ్లూరుపేటలో టిడిపి రుద్రాక్ష పూజలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ, ఆయన క్షేమంగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రుద్రాక్ష పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి నేతృత్వంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో రుద్రాక్ష పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయం నుంచి రుద్రాక్ష పూజలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమమని, ఆయన అయ్యేందుకు భగవంతుని ఆశీస్సులు కూడా కావాలన్న కోరికతో ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు చేసినా చంద్రబాబునాయుడు విడుదల కావడం తథ్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎజి కిషోర్, బుద్ధి విజయలక్ష్మి, దంతల రవి, జక్కల బాలయ్య, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, గండవరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు మహిళ .. బాబుతో నేను

**సైకో పోవాలి .. సైకిల్ రావాలి .. ఇదే మా నినాదం**

**టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి**



చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసగా టిడిపి తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో 13వ రోజు బాబుతో నేను కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరశిస్తూ 13 రోజులుగా టిడిపి అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో నిరసన గళం వినిపిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తెలుగు మహిళలు చేపట్టి రిలే నిరాహార దీక్షకు టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి తన సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ముక్తకంతంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ చూసినా ధర్నాలు, నిరసన ర్యాలీలు, నిరాహార దీక్షలు చేపట్టి సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో హోరెత్తిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు, లోకేష్ పర్యటనలతో ప్రజల్లో పెరుగుతున్న మద్దతుకు భయపడిన జగన్ మానసికంగా వేధించడానికే అక్రమంగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. ఈ 5 ఏళ్ళ పాలనలో వైసిపి ప్రభుత్వ పాపాలకు శిక్షలు అనుభవించక తప్పదని హెచ్చరించారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుండి మహిళలు తరలిరాగా, చంద్రగిరి మండలం నుండి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై చంద్రబాబు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు.

## ఎస్సీవీని పరామర్శించిన సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అనారోగ్యంతో తిరుపతి లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి లో చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న తెదేపా నియోజ కవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని ఎస్సీవీ నాయుడును పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని త్వరగా కోలుకుని పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఆయన్ను పరామర్శించిన వారిలో పట్టణాధ్యక్షులు విజయకుమార్, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజానాయుడు, పలువురు తెదేపా నేతలు ఉన్నారు.

## చంద్రబాబుకు బాసటగా చేతులకు సంకెళ్లతో టిడిపి సిరసన

**అరెస్టుతో టిడిపి విజయాన్ని అడ్డుకోలేరు**

**గంగాధర నెల్లూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ థామస్)**



గంగాధర నెల్లూరు, 26 సెప్టెంబరు ప్రభాతవార్త: అక్రమ అరెస్టుతో రానున్న శాసన సభ ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరు అడ్డుకోలేరని గంగాధర నెల్లూరు నియోజక వర్గ టిడిపి ఇచార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. గంగాధర నెల్లూరులో 15వ రోజుటిడిపి రిలే నిరాహార దీక్ష సిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా టిడిపి నాయుకులు కార్యకర్తలు చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి అక్షాలాది మందికి మార్గదర్శంగా నిలిచిన చంద్రబాబుకు సంకెళ్ల పోలవరం 72శాతం నిర్మించినందుకా రాజధాని నిర్మాణం కోసం 32 వేల ఎకరాల సేకరించి నందుకా రాష్ట్రంలో బారీ ఎత్తున పరిశ్రమలు స్థాపించినందుకా సంకెళ్లు అంటూ నానాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్బంగా థామసన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పర్యటనలకు కేంద్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమాలు విజయవంతమైనందుకు చూసి ఓర్చుకోలేక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించాలని అయితే కేసులకు టిడిపి భయపడే ప్రసక్తే లేదని త్వరలో చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల కావడం ఖాయమని రానున్న శాసన సభ ఎన్నికల్లో భారీ విజయం సాధించి యంద్రబాబు మరో పర్యాయం ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి పి.ఎస్‌మనోహర్ నాయుడు, రాష్ట్ర ప్రవాసీలుల కమిటి మెంబర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, జిల్లా ఉపాధ్యాక్షులు వెంకటేష్, జిల్లా యాదవ్ సాధికారి సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, గంగాధర నెల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు లోకనాథ రెడ్డి, కార్వేటి నగరం మండల పార్టీఅధ్యక్షులు చెగ్రాయ్ యాదవ్, పాలసముద్రం మండల పార్టీ అధ్యక్షులు రాజేంద్ర, పెనుమూరు మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, పెనుమూరు మాజీ ఎంపిపి హరిబాబు నాయుడులతో పాటు టిడిపి నేతలు కృష్ణమూర్తి నాయుడు, మునిచంద్రారెడ్డి, మోహన, మురళి మోహన్ నాయుడు జానన, శివకుమార్‌లతో పాటు భారీ ఎత్తున టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీకళ్యాణ వేంకన్న బ్రహ్మోత్సవాలు

**-చక్ర స్నానానికి భారీగా తరలివచ్చిన భక్తులు**



తిరుపతిరూరల్, సెప్టెంబర్26 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలలో చివరి ఘట్టం చక్ర స్నానంతో ముగిసింది. మంగళవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల మధ్య చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు.. కంకణభట్టార్ గిరిధర్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమం జనం వైభవంగా నిర్వహించారు. విష్వక్సే నారాధన, పుణ్యాహ వచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, చత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు. ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు దివ్యప్రబంధంలోని అభిశేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేసారు. ఈ వేడుకలో ఒక్కోక్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మూలలను స్వామి, అమ్మవార్లకు అలంకరణ చేసారు. చివరిగా పుష్కరిణిలోకి చక్రతాళ్వార్ తీసుకుని వెళ్లి మూడుసార్లు నీట ముంచారు. మంగళవారం సాయంత్రం 5:30 నుండి 7గంటల మధ్యన జరిగిన ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, తుడ ఛైర్మెన్ మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (బుధవారం)

పగలు : ధ్వజావరోహణం...ఉభయదారులు: దేవస్థానం వారిచే.
సాయంత్రం : అభిషేకం, వడాయత్తు ఉత్సవం
ఉభయదారులు : కీ॥శే॥ శ్రీ గాలి ఉమాపతి నాయుడు, కాకర్లవారిపల్లె. రాత్రి : ఏకాంతసేవ
ఉభయదారులు: కీ॥శే॥శ్రీకె.సోమశేఖరరెడ్డి వారి జ్ఞాపకార్థం వారి కుమారులు, కాణిపాకం.
ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఇ.కోదండరెడ్డి, ఒడ్డుపల్లె వారిచే ధార్మికోపన్యాసము, 12 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్.సుమతి భాగవతారిణిచే హరికథ, 2 గంటల నుండి 4 గంటల వరకు పి.కృష్ణారెడ్డి, కసపనూరు, సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు డి.పద్మావతి, మిట్టూరు, చిత్తూరు వారిచే భక్తిగీతాలు, 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు సాయి నాట్యాంజలి సైన్స్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, నంద్యాల, 7 గంటల నుండి 8 గంటల వరకు రతిప్రియ వాలాజీపేట, 8 గంటల 9 గంటల వరకు ఆర్.శరణ్య, పెరిమతుప్పం వారిచే భరతనాట్యం, 9 గంటల నుండి 10 గంటల వరకు శివజ్యోతి నృత్యాలయం గుడివాడ వారిచే కూచిపూడి నాట్యం, 10 గంటల నుండి 12 గంటల వరకు భగవాన్ శ్రీసత్యసాయి నాటకోత్సవ సమితి అనంతపురం వారిచే పౌరాణికనాటక ప్రదర్శన, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, లంబాడి నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగు తున్న బ్రహ్మోత్స వాలలో భాగంగా మంగళవారం జరిగిన అశ్వవాహనసేవ, తిరుకళ్యాణం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతో అలరించాయి. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా ధార్మికోపాన్యాసం, భక్తిగీతాలు, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. దీనితో పాటు ఉదయం వణగ, బలిజ వంశస్థులచే వేర్వేరుగా జరిగిన అష్టోత్తర కలశాల ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, కోలాటాలు, డ్రమ్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## గణనాథునికి ఘనంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా మంగళ వారం జరిగిన తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ సందర్భంగా ఉభయదారులైన వేర్వేరు వంశస్థులచే వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను ఘనంగా నిర్వహిఒచారు. ఈమేరకు తిరుకళ్యాణం ఉభయ దారులైన కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు, అశ్వవాహనసేవ ఉభయదారులైన బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాధుల గోనుగుంట బలిజ వంశస్థులు వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. వీరు స్థానిక మణికంఠేశ్వరాలయం నుండి మంగళవాయిద్యాల అష్టోత్తర శత కలశాలను గ్రామపురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకస్వాములు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన అష్టోత్తర శత కలశాలలోని పాలతో అభిషేకించారు. అలాగే పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. వేదపండితులు మంత్రపుష్పం గావించారు. దీనితో ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరి మాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## టీటీడీ తరపున పట్టువస్త్రసాల బహూకరణ



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళ వారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత స్వామి వార్లకు టీటీడీ తరపున నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈమేరకు టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, అర్చకులు కాణిపాకం చేరుకుని పట్టువస్త్రాలను స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏఈఓ ఎస్వీ,కృష్ణారెడ్డి ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

**గణనాధుని సేవలో టీటీడీ జెఈఓ**

టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం దంపతులు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా టీటీడీ తరపున పట్టు వస్త్రాలను సమర్పించిన అనంతరం వారు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్, ఈఓ, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందచేశారు. వారి వెంట ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఆదిదంపతుల బిక్షాటన



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా మంగళవారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా ఆది దంపతులైన శివపార్వతులు కాణిపాకం పుర వీధుల్లో బిక్షాటన సాగించారు. తమ కుమారుడైన గణనాధుని తిరుకళ్యాణంకు కావలసిన వస్తు సామాగ్రిని సమకూర్చు కోవడానికి తల్లిదండ్రులైన శివపార్వతులిద్దరూ కాణిపాకం పుర వీధుల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీ. ఈమేరకు మణికంఠేశ్వరాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుని కళ్యాణానికి కావలసిన ధన, కనక, వస్తువులను అందించాలని కోరుతూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన సాగించారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, మణికంఠేశ్వరాలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, మాజీ ఛైర్మన్ జగన్నాధరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ అధికారులు, ఉభయదారులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన చేశారు. ఈసందర్భంగా భక్తులు తమవంతు విరాళాలను స్వామివారి కళ్యాణానికి అందించారు.

## గణనాధునికి వెండి వీభూది పట్టీ బహూకరణ



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారికి ఓ భక్తుడు మంగళవారం రాళ్ళు పొదిగి వెండి వీభూది పట్టీని విరాళంగా అందజేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం దోర్నకంబాలకు చెందిన మురళీఆచ్చారి అనే భక్తుడు సుమారు 60 వేల రూపాయల వ్యయంతో 450 గ్రాముల వెండితో రాళ్ళు పొదిగి ప్రత్యేకంగా తయారు చేయించిన వీభూది పట్టీని ఆలయానికి విరాళంగా అందజేశారు. వీభూదీ పట్టీని ఆలయ సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేషలకు అందజేశారు. దాతలకు అలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## అధికార వైఎస్సార్సీనుంచి ఇద్దరు కౌన్సిలర్ల సస్పెండ్

**- కుప్పం మున్సిపల్ కార్యాలయంకు తాళాలేసిన ఘటనపై అధిష్టానం సీరియస్**

**- పోలీసులకు ఫిర్యాదు చేయనున్న మున్సిపల్ కమీషనర్ ..?**



కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : కుప్పం మున్సిపాలిటీ అధికార పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లపై వేటు పడిందని, మున్సిపల్ కార్యాలయంకు తాళాలు వేసిన ఘటనపై అధిష్టానం సీరియస్‌గా ఉందని కుప్పం మున్సిపల్ జెసిఎస్ ఛైర్మన్, ఎఎంసి ఛైర్మన్ విద్యా సాగర్ ప్రకటించారు. మంగళవారం కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్‌తో కలసి ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను మున్సిపల్ కార్యాలయం నుంచి బయటకు రప్పించారని ఈ సంఘటనలో పలువురు వైకాపా కౌన్సిలర్లతో పాటు తెదేపా కౌన్సిలర్లు ఉన్నారన్నారు. మున్సిపల్ కార్యాలయంకు తాళాలు వేసిన 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అలీ, 21వ వార్డు కౌన్సిలర్ ఎంఆర్ సురేష్‌లను అధిష్టానం ఆదేశాలతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొ న్నారు. అలాగే షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీకి ఇబ్బంది కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే అధిష్టానం తగు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ కుప్పం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం చోటు చేసుకున్న సంఘటన శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలు తగవని పేర్కొన్నారు. ఈ సంఘటనను తాను ఛైర్మన్‌గా ఖండిస్తున్నానన్నారు. ఈ వ్యవహారంలో కౌన్సిలర్లు అవగాహన రాహిత్యంతో చేశారా లేక కావాలనే చేశారా అనే కోణంలో విచారిస్తున్నామన్నారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేవారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. కాగా మున్సిపల్ ఉద్యోగులను కార్యాలయం నుంచి బయటకు రప్పించి విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ పలువురు కౌన్సిలర్లపై కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## శ్రవణా నక్షత్రం "దేవేరులతో శ్రీకల్యాణ వెంకన్న"



చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు మంగళవారం శ్రవణా నక్షత్రంను పురస్కరించుకుని తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టిం పజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు ఏ.వై.ఎల్.యన్.శ్రీనివాసాచార్యులు, అధ్యాపక రవిచంద్రన్, పరిచారిక డాక్టర్ లక్ష్మీ రాజేష్, విష్ణు స్వామి, జమేదర్ విజలెందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేపచెట్టు నుంచి కారుతున్న పాలు

**-4రోజులుగా యదాతథం -తరలివస్తున్న జనం**



చౌడేపల్లి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: గత 4రోజులుగా వేప చెట్టు నుంచి పాలు ధారలా కారుతుం డటంతో ప్రజలు దండోప దండలుగా తరలివెళ్ళి పూజలు చేస్తున్నారు. మండలంలోని ఎ.కొత్తకోటకు కూతవేటు దూరంలో గెవిమఠం వుంది. అక్కడే పాడుపడ్డ ఆలయం వద్దగల ధ్వజస్తంభానికి ఎదురుగావున్న ఓ వేప చెట్టునుంచి రెండు రోజులుగా పాలు కారుతోంది. వేపచెట్టును గ్రామదేవతగా కొలిచే సాంప్రదాయముండటంతో మహిళలు చెట్టుకు పూజలు చేసారు. మరికొందరు పాలను తాము పూజ కోసం కొట్టిన కొబ్బరి చిప్పలో ఇళ్ళకు తీసుకెళుతున్నారు. యువతీ, యువకులు చెట్టునుంచి ఏకధాటిగా వస్తున్న పాలను తమ సెల్‌ఫోన్ కెమరాల్లో బంధించడమే కాకుండా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వింతను తిలకించారు. ఎన్నడూ లేని విధంగా దేవునిమఠం వద్ద వేపచెట్టుకు పాలు కారుతోందనీ, ఒకటి, రెండు రోజులు కారి ఆగిపోకుండా 4రోజుల నుంచి ఏకధాటిగా పాలు కారుతూనే వుండటంతో గ్రామానికి అమ్మవారు ఏదైనా సందేశం ఇవ్వాలనుకొంటోందా అన్నట్లుగా మరికొందరు గ్రామస్తులు చెవులు కొరుక్కోవడం కనిపించింది.

## గోవిందరాజస్వామి వారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : తిరుపతి శ్రీ గోవింద రాజస్వామి వారి పవిత్రోత్స వాల్లో భాగంగా మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొల్పి, తోమాలసేవ, సహస్రనా మార్చన నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 8.30 గంటల వరకు శ్రీ దేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యాక్రమాలు నిర్వహించారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, తేనె, పసుపు చందనంలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు ఉప ఆలయాలకు, పరివార దేవతలకు విమానప్రాకారానికి, ధ్వజ స్తంభానికి, శ్రీ మఠం ఆంజనేయ స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఆలయ ప్రధానార్చ కులు ఎపి శ్రీనివాస దీక్షితులు, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.